క్లుప్తంగా

ఇంటి స్థలాల పరిశీలన



లేఅవుట్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగరాజు

మద్దికెర: స్థానిక కొండమ్మ బావి వద్ద ఉన్న ఇంటి స్థలాల లేఅవుట్‌ను శుక్రవారం తహసీల్దార్ నాగరాజు తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇల్లు లేని వారందరికీ ఇంటి పట్టా ఇచ్చేందుకు సిద్ధం చేస్తున్నామన్నారు. అందరూ సహకరిస్తే ఇంటి పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ రవికుమార్, వీఆర్వో రంగస్వామి ఉన్నారు.

మార్కెట్ వేలాలు వాయిదా

ఆలూరు రూరల్: గ్రామ పంచాయతీ పరిధిలోని రోజు వారి మార్కెట్, వారపు సంత, పశువుల సంత వేలాలు వాయిదా వేసినట్లు ఆలూరు మేజర్ పంచాయతీ ఈఓ కృష్ణ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీలో వేలాలు నిర్వహించారు. కార్యక్రమానికి సర్పంచ్ అరుణాదేవి, ఈఓపీఆర్డీ ప్రకాష్ నాయుడు హాజరయ్యారు. పాటదారులు హాజరు కానందున వేలాన్ని ఈ నెల 28కి వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు. వేలం పాటలో పాల్గొనేవారు రూ.2 లక్షల నగదు డిపాజిట్ చేయాలన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్

గోనెగండ్ల: సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను తెలుసుకుని వాటిని ఎప్పటికప్పుడు పరిష్కారించాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని బైలుప్పల గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఈఓఆర్డీ నాగేష్ ఉన్నారు.

విజేత గాజులపేట వృషభాలు



పోటీలను ప్రారంభిస్తున్న సీపీఐ మండల కార్యదర్శి సుల్తాన్

తుగ్గలి: చౌడేశ్వరీదేవి ఉత్సవాల సందర్భంగా కడమకుంట్లలో శుక్రవారం నిర్వహించిన బండలాగుడు పోటీల్లో గాజులపేట వృషభాలు విజేతగా నిలిచాయి. పోటీలను సీపీఐ మండల కార్యదర్శి సుల్తాన్, బహుమతి దాతలు ప్రారంభించారు. పోటీల్లో గాజులపేట పసుపులేటి రమణయ్య వృషభాలు మొదటి స్థానం, ఆత్మకూరు గాండ్ల రవిచంద్ర వృషభాలు రెండో స్థానం కైవసం చేసుకున్నాయి. ఆ తర్వాత స్థానాల్లో వరుసగా గడేకల్ ఎస్‌పీ బుల్స్, యంగన్నపల్లె వడ్డే మల్లికార్జున, చాబాల చిన్న కుళ్లాయప్ప వృషభాలు నిలిచాయి. విజేతల యజమానులకు బహుమతి దాతలు వరుసగా రూ.30వేలు, రూ.25వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10 వేలు అందజేశారు.

ఆర్డీఓ విస్తృత పర్యటన



నంచర్లలో రైల్వే లైన్‌కు భూమిని పరిశీలిస్తున్న ఆర్డీఓ మోహన్ దాస్

చిప్పగిరి: మండలంలో ఆర్డీఓ మోహన్‌దాస్ శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. నంచర్ల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రైల్వే డబుల్ లైన్‌కు సంబంధించి భూములను పరిశీలించారు. ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం వివరాలు అడిగి తెలుసుకున్నారు. బెల్డోణ గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి, సమయపాలన పాటించాలని సిబ్బందికి సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సంక్షేమ ఫలాలు అర్హులందరికీ చేరేలా చూడాలన్నారు. ఆర్డీఓ వెంట తహసీల్దారు లక్ష్మీ నారాయణ, ఏఓ ఆనంద్, డీటీ గుండాల నాయక్, వీఆర్ఓ రంగన్న తదిరులు ఉన్నారు.

ఘనంగా తిమ్మగురుని పల్లకీ సేవ

కృష్ణగిరి: మండల పరిధిలోని ఎరుకలచెర్వు గ్రామంలో శుక్రవారం తిమ్మగురుని పల్లకీ సేవను గ్రామస్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి గ్రామ వీధుల గుండా ఊరేగించారు. అనంతరం వసంతసేవను, సాయంత్రం నందికోల సేవ కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం పాలపళ్ల ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు.

వరుణ దేవుడు కరుణించంతో నీటి ప్రాజెక్టులు నిండుకుండలను తలపిస్తున్నాయి. మరో వైపు భూగర్భ జలాలూ వృద్ధి చెందాయి. దీంతో అన్నదాతలు ఎలాంటి భయం లేకుండా రబీ సాగు చేపట్టారు. అధికారుల హామీతో వేల ఎకరాల్లో పంటలు వేశారు. కాలువలకు నీరు వదలడంతో పైర్లు కళకళలాడుతున్నాయి. తమ పంటలను చూసుకుంటూ రైతన్నలు మురిసిపోతున్నారు. – ఎమ్మిగనూరు



తుంగాతీరంలో సాగుచేసిన వరి పంట

ఈక్రాప్ నమోదు పూర్తి



ఎమ్మిగనూరు సబ్‌డివిజన్ పరిధిలో రబీ పంట కింద సాగైన మొత్తం 8,778.5 హెక్టార్లను ఈ–క్రాప్ కింద నమోదు చేశాం. విపత్తులు ఎదురైనా, పంట దిగుబడులు తగ్గినా, ప్రభుత్వ చేయూత పొందాలన్నా ఈక్రాప్ నమోదు కీలకం. ఈ–క్రాప్ నమోదు అయిన ప్రతి పంటకు బీమా వర్తిస్తుంది.
– మహ్మద్ ఖాద్రి, ఏడీఏ–ఎమ్మిగనూరు

నీరు బిరబిర.. సాగు కళకళ

- ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరు
- విస్తారంగా రబీ సాగు
- పంట దిగుబడులపై అన్నదాత ఆశలు

ఈ యేడాది విస్తారంగా వర్షాలు కురవటంతో భూగర్భజలాలు వృద్ధి చెందాయి. సాగునీటి ప్రాజెక్టుల్లోనూ పుష్కలంగా నీరు ఉంది. దీంతో రైతులు రబీ పంటను విస్తారంగా సాగుచేశారు. నాలుగేళ్లుగా కాలం కలిసి వస్తుండటంతో ఈ రబీపై మరింత ఆశలు పెట్టుకున్నారు. కాగా ప్రభుత్వం రైతు భరోసా సాయం, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తుండటంతో రైతులకు సాగు ఖర్చు తగ్గింది. వ్యవసాయశాఖ అధికారులు ఎప్పటికప్పుడు పంటల పర్యవేక్షణ చేపట్టడం, యాజమాన్య పద్ధతులపై అవగాహన కలిస్తుండటం కూడా అన్నదాతలకు కలిసి వస్తోంది. సబ్ డివిజన్‌లో 8778.9 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. అనుకోని పరిస్థితుల వల్ల పంటలకు నష్టం వాటిల్లితే పరిహారం అందించేందుకు ప్రభుత్వం ఈ–క్రాప్ నమోదును కూడా పూర్తి చేసి రైతులకు అండగా నిలిచింది. అంతా అనుకున్నట్లు జరిగితే తమ దిగుబడులు చేతికి వస్తాయనే ఆశాభావంతో రైతులు ఉన్నారు.

ఆశాజనకం సాగునీటి వనరులు..

ఎమ్మిగనూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో సాగునీటి వనరుల్లో పుష్కలంగా నీరుంది. ఈయేడాది కూడా రబీ పంటకు ఢోకా లేదని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తుంగభద్ర నదితీరంలో రబీ పంటగా రైతులు వరి, మొక్కజొన్నలను సాగుచేశారు. నాలుగేళ్లుగా తుంగభద్రనది అంతరాయం లేకుండా ఏకధాటిగా ప్రవహిస్తుండటం రైతులకు మేలు కలిగిస్తోంది. తుంగభద్ర దిగువ కాలువ నుంచి, గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి, గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాల నుంచి సాగునీరు అందుతుండటంతో రైతులు రబీలో పంటలు విస్తారంగా సాగుచేశారు.

8778.9 హెక్టార్లలో రబీ సాగు..

వ్యవసాయశాఖ గణాంకాల ప్రకారం రబీ పంట సాధారణ విస్తీర్ణం 9,810 హెకార్లు కాగా పంటసాగైంది 8778.9హెక్టార్లు. అదే ఉద్యానవనశాఖ పరిధిలో ఉల్లి, మిర్చి పంటలు 730.5 హెక్టార్లలో సాగైంది. వరి సాధారణ విస్తీర్ణం 1,065 హెకార్లు కాగా సాగు విస్తీర్ణం 949.3 హెక్టార్లు. మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 1,178 హెక్టార్లు కాగా 3110.19 హెక్టార్లలో సాగైంది. శనగపంట సాధారణ విస్తీర్ణం 3,092 హెక్టార్లు కాగా 3,288 హెక్టార్లల్లో రైతులు పంటను సాగుచేశారు. వేరుశనగ సాధారణ విస్తీర్ణం 2,315 హెక్టార్లు కాగా రైతులు 2091.88 హెక్టార్లలో పంటను సాగుచేశారు.



గాజులదిన్నె ప్రాజెక్టు పరిధిలో వేరుశనగసాగు

పంటయాజమాన్య పద్ధతులు

పంటలసాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఆశించినమేర పంట దిగుబడులు వస్తాయి. ఇందుకోసం వ్యవసాయశాఖ క్షేత్రస్థాయి సిబ్బందితో గ్రామగ్రామాన రైతులకు అవగాహన కల్పిస్తూ పంటసాగుపై సూచనలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలోనే నేరుగా పంటను పరిశీలించి రైతులకు అందుబాటులో ఉంటున్నారు. పురుగు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూనే వ్యవసాయ ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తల సూచనలు రైతులకు తెలియజేస్తున్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం

ఆలూరు: మండలంలోని కమ్మరచేడు గ్రామంలో కాడ సిద్ధప్ప స్వామి ఆలయం నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లికార్జునరెడ్డి రూ.2 లక్షల విరాళం ఇచ్చారు. నగదును శుక్రవారం ఆయన గ్రామ పెద్దలకు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ హరిపుష్పావతమ్మ, సర్పంచ్ సుమతి, ఎంపీపీ రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు హొళగుంద పంచాయతీ వేలం పాటలు

హొళగుంద: స్థానిక మేజర్ పంచాయతీకి సంబంధించిన వేలం పాటలు శనివారం సర్పంచ్ మాల రంగమ్మ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ తెలిపారు. వారపు సంత మార్కెట్, బస్టాండు, కమేళా, సుజల స్రవంతి వాటర్‌ప్లాంట్ ఏడాది నిర్వహణ, బస్టాండులోని 5 హోటల్ స్థలాలకు మూడేళ్ల లీజుకు సంబంధించి వేలం పాటలు జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్న వారు వాటర్‌ప్లాంట్‌కు రూ.5 వేలు, మిగిలిన వాటికి సాల్వెన్సు(స్వంత ఆస్తులు) ఉన్న వారు రూ.50 వేలు, రూ.లక్ష, సాల్వెన్సు లేని వారు రూ.70 వేలు, రూ.2 లక్షలు చొప్పున డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు. గతంలో వేలం పాటలో పాల్గొని నేటికీ పంచాయతీకి డబ్బు చెల్లించని వారికి వేలం పాటలో అనుమతి లేదన్నారు.

విద్యుత్ సమస్య లేకుండా చూడాలి

ఎమ్మిగనూరు టౌన్: రంజాన్ మాసం ప్రారంభమైనందున ముస్లింలకు విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి విద్యుత్ శాఖ అధికారులను కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విద్యుత్ ఏడీ రాఘవేంద్రారావును కలిసి పట్టణం, నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి శాశ్వత పరిష్కారం

కృష్ణగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపడుతున్న జలజీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చి నీటి సరఫరా చేయడం జరుగుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరి తెలిపారు. మండల పరిధిలోని తొగర్చేడు గ్రామంలో జరుగుతున్న పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామంలో దాదాపు రూ.40 లక్షలతో పనులు చేపడుతున్నామన్నారు. మండలంలో ఇప్పటికే ఏడు గ్రామాల్లో పనులు పూర్తి కాగా మరో ఐదు గ్రామాల్లో పనులు జరుగుతున్నాయన్నారు. త్వరలో అన్ని గ్రామాల్లో పనులు ప్రారంభించి ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

రుణాలు రెన్యూవల్ చేసుకోండి

కృష్ణగిరి: ప్రభుత్వ పథకాలలో భాగంగా తీసుకున్న రుణాలకు వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని సహకార సంఘం సీఈఓ శివన్న సూచించారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ సొసైటీ కింద వివిధ రకాల రుణాలు విరివిగా ఇచ్చామన్నారు. ఈ నెల చివరికల్లా వడ్డీ చెల్లిస్తే రెన్యూవల్ చేస్తామన్నారు. వడ్డీ సకాలంలో చెల్లించకపోతే అపరాధ రుసుం కింద వడ్డీ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

గాయత్రీ మాతకు ప్రత్యేక పూజలు

ఆస్పరి: ఉగాది పండుగ సందర్భంగా ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వాహకులు రూపా మోహన్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మిన్నంటిన వాల్మీకుల సంబరాలు



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న హాలహర్వి వైఎస్సార్‌సీపీ నాయకులు



హొళగుంద వాల్మీకి సర్కిల్ వద్ద సంబరాలు చేసుకుంటున్న వాల్మీకులు

ఆలూరు: వాల్మీకులను ఎస్టీ జాబితలో చేర్చాలని శుక్రవారం అసెంబ్లీలో తీర్మానించి బిల్లును కేంద్రానికి పంపడంతో వాల్మీకులు సంబరాలు చేసుకున్నారు. హాలహర్వి మండల కేంద్రంలో చింతకుంట సొసైటీ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆలూరులోని సచివాలయ కన్వీనర్ ఈరన్న ఆధ్వర్యంలో వాల్మీకి కులపెద్దలు బీసీ మాదన్న, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ నాగవేణి, తదితరులు వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి, బాణా సంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. దేవనకొండలో పార్టీ మండల కన్వీనర్ మల్లికార్జున ఆధ్వర్యంలో వాల్మీకులు సంబరాలు చేసుకున్నారు. చిప్పగిరి ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ జూటూరు హేమలత, వైఎస్సార్‌సీపీ నాయకుడు మారయ్య మాట్లాడుతూ వాల్మీకులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారన్నారు. అలాగే దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, ఆలూరు, చిప్పగిరి జెడ్పీటీసీ వీరుపాక్షి, ఏరూరు శేఖర్, ఆస్పరి, హాలహర్వి ఎంపీపీ ఉమాదేవి, నెట్టకంటమ్మ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.
– హొళగుంద: మండల కేంద్రంలోని వాల్మీకి మహర్షి విగ్రహం వద్ద సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి వాల్మీకులు పాలాభిషేకం చేశారు. బాణా సంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అడ్వైజర్ బోర్డు డైరెక్టర్ కుమార స్వామి, సింగిల్‌విండో చైర్మన్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

‘పది’లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ వేణుగోపాల్



హొళగుంద కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఏపీసీ వేణుగోపాల్

ఆలూరు రూరల్/హొళగుంద: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా సమగ్ర శిక్షణ అభియాన్ అదనపు కోఆర్డినేటర్ వేణుగోపాల్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం ఆయన జిల్లా జీసీడీఓ (గరల్స్, చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) సునీతతో కలిసి ఆలూరు, హొళగుంద కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. పబ్లిక్ పరీక్షల కోసం కష్టపడి చదివి మంచి మార్కులతో పాస్ కావాలన్నారు.
- హొళగుంద: ఎల్లార్తి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులు సరస్వతి పూజ కార్యక్రమం నిర్వహించుకున్నారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి గురువులకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని హెచ్ఎం కబీర్‌సాబ్ విద్యార్థులకు సూచించారు.
- గోనెగండ్ల: పదవ తరగతిలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఎంఈఓ వినోద్ కుమార్ సూచించారు. శుక్రవారం ఎమ్మార్సీ భవనంలో పదవ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన విజయ దీపిక మెటీరియల్స్‌ను హెచ్ఎంలకు అందజేశారు.

యంత్రసేవను సద్వినియోగం చేసుకోవాలి



రైతులకు ట్రాక్టర్‌ను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ

ఆలూరు: వైఎస్సార్ యంత్ర సేవా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని దేవనకొండ జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ సూచించారు. శుక్రవారం ప్యాలకుర్తి గ్రామ ఆర్‌బీకే సీహెచ్‌సీ గ్రూపు రైతులకు మంజూరైన ట్రాక్టర్‌ను ఆయన అందజేశారు. ఈసందర్భంగా రామకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో పత్తికొండ కేడీసీసీ బ్యాంకు మేనేజర్ ముధుసూదన్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ మెంబర్ కె.శాంతి కుమార్, ఏఓ సురేష్‌బాబు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి

వెల్దుర్తి: ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని గోవర్ధనగిరి గ్రామంలో జిల్లా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా యువజన వ్యవహారాల అధికారి రాహుల్ రెడ్డి, కొండా హెల్పింగ్ హ్యాండ్స్ అండ్ యూత్ సొసైటీ వ్యవస్థాపకులు కొండా లోకేశ్ రావ్, సైకాలజీ మోటివేషనల్ స్పీకర్ నాగశేషుడుతో పాటు చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి హాజరై మాట్లాడారు. యువత చెడు మార్గాలకు దూరంగా ఉంటూ మంచి లక్ష్యాలతో పుట్టిన ఊరుకు, తల్లితండ్రులకు, గురువులకు, పేరు తేవాలని సూచించారు. అనంతరం సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లరాముడు, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ వెంకట్‌నాయుడు పాల్గొన్నారు.

బాలికకు డెంగీ లక్షణాలు

- గ్రామాన్ని సందర్శించిన వైద్య సిబ్బంది



నీటిలో లార్వాను పరిశీలిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా

ఆలూరు: దేవనకొండ మండలం అలారుదిన్నె గ్రామంలో 12 ఏళ్ల బాలికకు డెంగీ లక్షణాలు ఉన్నట్లు వైద్యులు నిర్ధారించట్లు తెలిసింది. అందులో భాగంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా బాలిక ఇంటి పరిసరాలను సందర్శించారు. సిబ్బందితో పరిసరాలను శుభ్రం చేయించారు. ఈసందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట సూపర్‌వైజర్లు ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు ఉన్నారు.

వైభవంగా ఉట్లోత్సవం



ఆస్పరిలో ఊరేగింపుగా బోనం తీసుకెళ్తున్న భక్తులు



పూజలందుకున్న జనార్దన స్వామి

ఆస్పరి: మండల కేంద్రంలో జనార్దన స్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉట్టి, వసంతోత్సవాలు వైభవంగా జరిగాయి. పూజారి నరసింహ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి గంగపూజ, పంచామృతాభిషేకం, పల్లకీ సేవ, మంగళహారతులు నిర్వహించారు. అనంతరం చిన్నాపెద్దా తేడా లేకుండా వసంతోత్సవంలో పాల్గొన్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. బంట్రోతు వారి ఇంటి నుంచి బోనాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం ఆలయం వద్ద ఉట్టి ఉత్సవం ఆకట్టుకుంది.

సీసీ రోడ్లు నిర్మించండి

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలోని లక్ష్మీపేట లింగన్న గౌడ్ కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించాలని సీపీఐ నాయకులు భాస్కర్‌యాదవ్, బాలరాజు, సమీవుల్లాలు కోరారు. శుక్రవారం లింగన్నగౌడ్ కాలనీలో సీపీఐ నాయకులు పర్యటించారు. కాలనీ వాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు.

ఆర్థిక సాయం



తక్షణ సాయం అందజేస్తున్న సర్పంచ్ విరుపాక్షిరెడ్డి

నందవరం: ముగతి గ్రామంలో మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందిన దస్తగిరమ్మ కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను అందజేశారు. నగదును సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, సచివాలయ కార్యదర్శి రామకృష్ణ తదితరులు మృతురాలి కుమారుడికి అంజేశారు.

అవగాహనతోనే క్షయ వ్యాధి నిర్మూలన



మాట్లాడుతున్న డాక్టర్ మారుతి




మద్దికెరలో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యాధికారి నగేష్

ఆలూరు రూరల్: సరైన అవగాహన, సకాలంలో మందులు వినియోగిస్తే క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ మారుతి అన్నారు. శుక్రవారం వరల్డ్ టీబీ డే సందర్భంగా ర్యాలీ నిర్వహించి.. ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెండు వారాలకు మించి దగ్గు, జర్వం వస్తున్నా, బరువు తగ్గిపోయి ఛాతి నొప్పి వస్తున్నా వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో సంప్రదించాలన్నారు. టీబీ నిర్ధారణ అయితే ప్రభుత్వం ఖరీదైన మందులను ఉచితంగా ఇస్తోందన్నారు. వ్యాధి సోకిన వారికి ప్రభుత్వం పౌష్టికాహారం కోసం నెలకు రూ.500 వంతున ఆరు నెలల పాటు వారి బ్యాంకు ఖాతాలో నగదు జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యులు పద్మజ, వాహిద్, టీబీ నివారణ అధికారి గోపాల్ పాల్గొన్నారు.
- ఆలూరు: మండల కేంద్రమైన దేవనకొండలో పీహెచ్ కేంద్రం ఆవరణం నుంచి గ్రామంలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా డాక్టర్ జ్యోతి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.
- మద్దికెర: క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దని ప్రభుత్వ వైద్యాధికారి నగేష్ సూచించారు. క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా మద్దికెరలో వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించి, వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.
- వెల్దుర్తి: ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక సీహెచ్‌సీలో సూపరింటెండెంట్ డాక్టర్ బాలచంద్ర రెడ్డి, టీబీ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అవగాహన, ర్యాలీ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.
- గోనెగండ్ల: మండల కేంద్రంలో డాక్టర్లు రవళి, రజిని ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించి క్షయ వ్యాధి నిర్మూలన నినాదాలు చేశారు.
- నందవరం: క్షయ వ్యాధి నిర్మూలన దినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో పీహెచ్‌సీ డాక్టర్ సౌజన్యలత ఆధ్వర్యంలో క్షయవ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు.

రసవత్తరంగా న్యాయవాదుల ఎన్నికలు

- అధ్యక్ష, కార్యదర్శులుగా లక్ష్మీకాంత్, విజయ్‌భాస్కర్



ఆలూరు రూరల్: స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో బార్ అండ్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం రసవత్తరంగా సాగాయి. సీనియర్ న్యాయవాది సిద్ధప్ప ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అధ్యక్షుడిగా లక్ష్మీకాంత్, కార్యదర్శిగా విజయ్ భాస్కర్ విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా వాయుజీవోత్తమ రావు, కోశాధికారిగా రాజేష్ నాయుడు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఉపాధ్యక్షుడిగా విజయ రాజు, సహాయ కార్యదర్శిగా శాకీర్, మహిళా ప్రతినిధిగా సునీలా ఫ్లోరెన్స్‌ను ఎన్నుకున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



పూర్వవిద్యార్థులు కలుసుకున్న దృశ్యం

చిప్పగిరి: మండలంలోని ఎరూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పూర్వ విద్యార్థుల(1985–86 పదో తరగతి బ్యాచ్) సమావేశం నిర్వహించారు. దాదాపు 37 ఏళ్ల తర్వాత కలుసుకుని ఒకరి నొకరు పలకరించుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అనంతరం తమకు విద్య నేర్పిన సోషల్ ఉపాధ్యాయులు శివప్పను ఘనంగా సన్మానించారు. పాఠశాలకు రూ.25,000 విలువ చేసే స్పీకర్‌ను విరాళంగా అందజేశారు.